నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 27 జనవరి 2024 | NALGONDA

సాగు నీటి విడుదల విషయాన్ని పరిశీలిస్తాం

• మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నేరేడుచర్ల, జనవరి 26 : సాగర్ జలాశయంలో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నందున నీటి విడుదల చేసే విషయాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సాగర్ డ్యామ్‌లో నీటి సామర్థ్యం చాలా తక్కువుగా ఉందన్నారు. అనంతరం ఉత్తమ మున్సిపల్ సిబ్బందిగా ఎంపికైన శ్రీకాంత్, వెంకన్న, వీరబాబులకు ప్రసంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ ప్రకాశ్, ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, జిల్లా మలేరియా నివారణ అధికారి సాహితి, కోదాడ రూరల్ సీఐ రామకృష్ణా రెడ్డి, కౌన్సిలర్లు కొణతం చిన్న వెంకట రెడ్డి, రణపంగ నాగయ్య, బాషా, షహనాజ్, అలక సరిత, తాల్లూరి సాయి, కొదమగుండ్ల సరిత, బాణోతు లలితాభరత్, నూకల సుగుణ, బచ్చల కూరి ప్రకాశ్, బైరెడ్డి జితేందర్ రెడ్డి, వేమూరి నాగ వేణి, కుంకు సులోచన, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి నాగిణి, తాసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శంకరయ్య పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'తెచ్చిన తంటా

• డ్రైవర్‌పై చేయిచేసుకున్న మహిళ

నకిరేకల్, జనవరి 26 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం పుణ్యమాని నిత్యం ఏదో ఒకచోట బస్సుల్లో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. శుక్రవారం నకిరేకల్‌లో సీటుతో మొదలైన గొడవ డ్రైవర్‌పై చేయిచేసుకునే స్థాయికి వెళ్లింది. బస్సు డ్రైవర్, ప్రయాణికులు చెప్పిన వివరాలు.. సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం సూర్యాపేటకు బయల్దేరింది. బస్సులో 74మంది ప్రయాణికులున్నారు. నార్కట్‌పల్లి బస్టాండులో ఎక్కిన ఓ మహిళ కేతేపల్లి మండలం చీకటిగూడెం వద్ద దిగాల్సి ఉంది. సదరు మహిళ మొదటగా నకిరేకల్ బస్టాపు వద్ద ఎక్కిన కొంత మంది మహిళలతో సీటు విషయంలో గొడవ పడింది. బస్సు కేతేపల్లి వద్దకు రాగానే డ్రైవర్ సీటు దగ్గరకు వచ్చి చీకటిగూడెం వద్ద ఆపమని డ్రైవర్‌ను అడిగింది. ఎక్స్‌ప్రెస్ కాబట్టి ఎక్కడపడితే అక్కడ ఆగదు మేడమ్ అంటూ సమాధానమిచ్చాడు. దాంతో ఆ మహిళ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగింది. ఒక దశలో డ్రైవర్‌పై చేయి చేసుకుంది. ఈలోపు చీకటిగూడెం స్టేజీ దాటిపోయింది. డ్రైవర్ రాయిన్‌గూడెం వద్ద రోడ్డు పక్కన బస్సు నిలిపాడు. బస్సులో ఉన్న ప్రయాణికులంతా డ్రైవర్‌ను బతిమిలాడడంతో మళ్లీ కొంత దూరం తీసుకెళ్లాడు. సదరు మహిళ మళ్లీ తిట్టడం ప్రారంభించింది. ఇటు ప్రయాణికులు, అటు మహిళకు సమాధానం చెప్పలేక డ్రైవర్ ఇబ్బంది పడ్డాడు. ప్రయాణికులు కలుగజేసుకుని ఆ మహిళను కొత్త బస్టాండ్ వద్ద దింపడంతో ఊపిరిపీల్చుకున్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కార్యక్రమాలు
- ఆర్టీసీలో 21,32,860 మహిళలు ఉచితంగా ప్రయాణం
- గణతంత్ర వేడుకల్లో సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్
- 200 మంది ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందజేత

సూర్యాపేటలో పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, జనవరి 26 : కొత్త ప్రభుత్వం పారదర్శకంగా పాలన అందించాలనే లక్ష్యంగా పని చేస్తుందని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ పేర్కొన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ జెండా ఎగుర వేశారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యాచరణ ఇప్పటికే మొదలైందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 21,32,860 మంది మహిళా ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు అభయ హస్తం గ్యారెంటీల కోసం స్వీకరించిన 3,76,419 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. యాసంగిలో పంట పెట్టుబడి కోసం 2,93,689 మంది రైతులకు రూ. 317.46 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,79,450 మందికి రూ. 96.76 కోట్లు అందించినట్లు చెప్పారు. రూ. 2 లక్షల రుణమాఫీకి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని 216 స్వయం సహాయక సంఘాలకు రూ. 9.16 కోట్ల వడ్డీలేని రుణాలను పంపణీ చేశామన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో 6 పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు శాదం వెంకట్‌రెడ్డి, గుడిపాటి అంజయ్య, టంగుటూరి కోటయ్య, బండ పుల్లారెడ్డిని పరేడ్ గ్రౌండ్ వేదికల్లో ఘనంగా సన్మానించారు. సుమారు 200 మంది ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. భానుపురి జిల్లా మహిళా సమాఖ్యలోని 7,931 సంఘాలకు రూ. 508.97 కోట్లు, 2,750 సంఘాలకు రూ. 90.59 కోట్ల చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 14 స్టాళ్లు అందరినీ ఆకర్షించాయి. కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, వెంకట్‌రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనా, ఏఎస్పీ నాగేశ్వర్ రావు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్‌తోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సూర్యాపేట పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల ప్రదర్శన

సూర్యాపేట పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాలతో విద్యార్థుల ప్రదర్శన

ముప్పన్నెల రెపరెపలు

జిల్లా వ్యాప్తంగా ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

వాడవాడలా జాతీయ జెండాల ఆవిష్కరణ

75వ గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, విద్యాలయాల్లో జాతీయ జెండాను ఎగుర వేసి వందనం చేశారు. విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని ర్యాలీలు తీశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్ వేడుకలు సంబురంగా సాగాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనా దీప్తి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారెంటీలు త్వరలో వస్తాయి
- ఆర్టీసీలో 39,77,469 మహిళలు ఉచితంగా ప్రయాణం
- గణతంత్ర దినోత్సవంలో నల్లగొండ కలెక్టర్ హరిచందన
- 121 మంది ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందజేత

నల్లగొండ, జనవరి 26 : ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారెంటీలను త్వరలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ అందజేసి సర్కార్ లక్ష్యాన్ని నెరవేర్చుతామని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం నల్ల గొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆమె జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. భారత రాజ్యాంగాన్ని అనుసరించి ప్రభుత్వం ప్రతి వ్యక్తికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలో డిసెంబర్ 9 నుంచి ఇప్పటి వరకు 39,77,469 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని చెప్పారు. డిసెంబర్ 9న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల వైద్యం పొందేలా ఏర్పాటు చేసిందన్నారు. 6 గ్యారెంటీలలో భాగమైన మహాలక్ష్మి, గృహ జ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లుతో పాటు చేయూత పథకాల కోసం 5,27,492 మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పంట పెట్టుబడి సహాయం కింద 2023-24 యాసంగి సీజన్‌కు 3,12,688 మంది రైతులకు రూ.172.41 కోట్లు అందించినట్లు చెప్పారు. రోడ్లు, భవనాలు శాఖ ద్వారా నల్లగొండ నుంచి ముషంపల్లి-కన్నెకల్ (వయా) ధర్మాపురం వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.99.80కోట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో 2,29,838 మంది వ్యవసాయ వినియోగదారులు ఉచిత విద్యుత్ ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.30.18కోట్లతో చేపట్టిన 15 విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణ పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు రూ.34 500కోట్లతో 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో 2024 డిసెంబర్ నాటికి ఐదు యూనిట్లు పూర్తి చేయడానికి శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఉపాధి పథకం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.130.64 కోట్లు ఖర్చు చేసి 2,63,59 మంది కూలీలకు 88 వేల పని దినాల ఉపాధి కల్పించామని చెప్పారు. ఆసరా పింఛన్ల కింద 2,10,611 మందికి రూ.53,73,43,000 పంపిణీ చేస్తున్నామన్నారు. రూ.292.71 కోట్లతో రోడ్లు, బ్రిడ్జిలు, తదితర పనులు చేపడుతున్నామని, రూ.32.65కోట్లతో దేవరకొండ, నిడమనూరులో కోర్టు భవనాలు, జడ్జి రెసిడెన్షియల్ క్వార్టర్స్, నల్లగొండలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్, ఆర్‌అండ్‌బీ ఆఫీస్‌తో పాటు మిర్యాలగూడలో ఇండోర్ స్టేడియం మొదలైన పనులు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, బ్రిడ్జి పనులు, భవనాల నిర్మాణం, రోడ్ల మరమ్మతులకు రూ.783.89 కోట్ల అంచనా వ్యయంతో 8,352 పనులు మంజూరైనట్లు చెప్పారు. నల్లగొండ మున్సిపాలిటీలో రూ.533 కోట్లు, మిర్యాలగూడలో రూ.101 కోట్లు, దేవరకొండలో రూ.56 కోట్లు, చిట్యాలలో రూ.19 కోట్లు, నందికొండలో రూ. 28కోట్లు, నకిరేకల్‌లో రూ.31 కోట్లు, హాలియాలో రూ.33 కోట్లు, చండూరులో రూ.52 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆయా వసతి గృహాల్లో 15వేల మంది, గురుకులాల్లో 24,500 మంది ప్రభుత్వం అందిస్తున్న నిధులతో ఉచితంగా భోజన వసతితో నాణ్యమైన విద్యను పొందుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో ప్రతిభ కనబరిచిన 36 మంది అధికారులు, ఉద్యోగులతోపాటు 85 మంది పోలీసులకు కలెక్టర్ హరిచందన ప్రశంశా పత్రాలు అందచేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ చందన దీప్తి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల ప్రదర్శన

ప్రశంసా పత్రం అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఘనంగా గంధోత్సవం

- సైదన్న ఉర్సుకు పోటెత్తిన భక్తజనం
- గంధం ఊరేగింపులో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గంధం ఎత్తుకొస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

పాలకవీడు, జనవరి 26 : మత సామరస్యానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న జాన్‌పహాడ్ దర్గా ఉర్సు జన జాతరను తలపిస్తున్నది. ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం గంధోత్సవం (ఉర్సే షరీఫ్) ఘనంగా, సాంప్రదాయ బద్ధంగా జరిగింది. హైదరాబాద్ వక్ఫ్ బోర్డు నుంచి తీసుకొచ్చిన గంధాన్ని ఫకీర్ల ఖవ్వాలీ, మేళతాళాలతో జాన్‌పహాడ్ దర్గా గ్రామంలోని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలోని చందల్ ఖానాలో ఉంచారు. మరోవైపు దర్గా ముజావర్ సయ్యద్ జానీ ఇంటి నుంచి గుర్రాలపై తీసుకొచ్చిన గంధాన్ని చందల్ ఖానాలో గల గంధంతో కలిపారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ గంధాన్ని ఎత్తుకొని ఊరేగింపుగా తీసుకెళ్లారు. దర్గాలో సైదులు బాబా సమాధులపై చాదర్‌ను ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జాన్‌పహాడ్ దర్గా ప్రధాన వీధుల్లో పోలీసు బందోబస్తుతో కల్మ టితండా, జాన్‌పహాడ్ గ్రామాల్లో ఆరు గంటల పాటు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గంధం అందుకోవడానికి భక్తులు పోటీపడగా.. స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకున్నది. అనంతరం దర్గాలోని హజ్రత్ సయ్యద్, మొహినుద్దీన్‌షా, జాన్‌పాక్ సయ్యద్ రహమతుల్లా సమాధుల మీదికి ఎక్కించారు.

పోటెత్తిన భక్తులు

సైదన్న ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. సఫాయి బావి వద్ద, మహంకాళీగూడెం పుష్కర్ ఘాట్ వద్ద కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దర్గా వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. తెలంగాణలోని పలు జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రాలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఒంగోలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే పర్యవేక్షణలో డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో 500 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. కోదాడ, మిర్యాలగూడ ఆర్టీసీ డిపోల నుంచి 50 బస్సులు నడిపారు.

ప్రముఖుల హాజరు

సైదన్న ఉర్సుకు కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, ట్రైనీ ఎస్పీ రాజేశ్ మీనన్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, డీఎస్పీ ప్రకాశ్, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ గోపాల్, జడ్పీటీసీ మాలోతు బుజ్జి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దర్గా అభివృద్ధికి కోటి రూపాయలు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

జాన్‌పహాడ్ దర్గా అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గంధం ఊరేగింపును ప్రారంభించిన ఆయన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ స్థానాల్లో గెలుపొందుతుందని.. కాంగ్రెస్‌కు, బీజేపీకి మధ్యే పోటీ ఉంటుందని పేర్కొన్నారు. తాగునీటి అవసరాల కోసం సాగర్ నీటిని త్వరలోనే విడుదల చేస్తామని, నియోజకవర్గంలో అవసరమైన మేర లిఫ్టులను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి

గంధం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

దర్గా ఆవరణలో భక్తుల రద్దీ

మధుర కవికి పద్మశ్రీ

కూరెళ్ల విఠలాచార్యకు కేంద్రపురస్కారం

ఇంటినే గ్రంథాలయంగా మార్చిన మహానుభావుడు

రామన్నపేట, జనవరి 26 : పల్లెలోనే తన రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తూ సాహిత్య పరిమళాలను వెదజల్లుతున్న కూరెళ్ల విఠలాచార్య కృషిని కేంద్ర సర్కారు గుర్తించింది. తన ఇంటినే గ్రంథాలయంగా మలిచి రెండు లక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచిన ఆయనను పద్మశ్రీ అవార్డు వరించింది. జాతీయ పురస్కారానికి ఎంపికైన కూరెళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సినీ నటుడు చిరంజీవి ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు.

రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కవి కూరెళ్ల విఠలాచార్య 1938 జూలై 7న కూరెళ్ల లక్ష్మమ్మ, వెంకటరాజయ్య దంపతులకు జన్మించారు. ఐదేండ్ల ప్రాయంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి లక్ష్మమ్మ అనేక కష్టాలకు ఓర్చి కూరెళ్లను చదివించింది. పోస్టల్ శాఖలో చిన్న ఉద్యోగంలో చేరిన కూరెళ్ల అధ్యాపక వృత్తిలోకి ప్రవేశించారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులుగా 35 సంవత్సరాలు పనిచేశారు. విద్యార్థుల్లో పఠన, రచన ఆసక్తిని పెంచడానికి గ్రంథాలయాలు, బాపూ భారతి, మన తెలుగుతల్లి, తొలి వెలుగు, మన పురోగమనం, చిరంజీవి, ప్రియంవద, ముచికింద వంటి పత్రికలను స్థాపించారు. 1960లో భువనగిరి మండలం వడాయిగూడెంలో అక్షరాస్యతా ఉద్యమం నిర్వహించి వయోజనులకు చదువు నేర్పించారు.

ఇంట్లోనే గ్రంథాలయం

ఉద్యోగ విరమణ అనంతరం తన ఇంటిలో ఐదు వేల పుస్తకాలతో ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం నెలకొల్పారు. పుస్తకాల సేకరణకు గ్రంథ భిక్ష కార్యక్రమం చేపట్టారు. పుస్తకాల సంఖ్య గణనీయంగా పెరుగడంతో ఇల్లు సరిపోక పాత ఇంటిని పడగొట్టి అధునాతన వసతులతో కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కుటుంబ సభ్యులు, బంధువులు, దాతలు, శ్రేయోభిలాషులు అందించిన ఆర్థిక సాయంతో రెండస్తులతో విశాలమైన భవనం నిర్మించారు. ప్రస్తుతం గ్రంథాలయంలో రెండు లక్షలకు పైగా పుస్తకాలున్నాయి.

కూరెళ్ల విఠలాచార్య

ప్రతి అవార్డు జన్మ భూమికి అంకితం

మారుమూల పల్లెలో నివసిస్తున్న తన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించడం పల్లెకు పట్టం కట్టినట్లుగా ఉన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, సాహితీ సంస్థలు ఇచ్చిన అవార్డులు, పురస్కారాలు ప్రతిదీ నాకు జన్మనిచ్చిన కన్నతల్లిలాంటి జన్మభూమికి అంకితం ఇస్తున్నా.

– కూరెళ్ల విఠలాచార్య

30కి పైగా రచనలు

కూరెళ్ల ఏడో తరగతి చదువుతున్న రోజుల్లోనే కవితలు, పద్యాలు రచనపై ఆసక్తిని పెంచుకున్నారు. తెలుగులో గొలుసుకట్టు నవలలు, స్వాతంత్రోద్యమం - ఆంధ్రప్రదేశ్‌లో దాని స్వరూపం, కూరెళ్ల శతకం, మా ఊరి వెలుగు, శిల్పాచార్యులు, కాన్ఫిడెన్షియల్ రిపోర్టు, నానీ నేత్రాలు వంటి 30కి పైగా రచనలు చేశారు. ఆయన కంఠం చాలా మధురంగా ఉంటుంది. ఆయన పద్యాలు చదువుతుంటే ఎంతో వినసొంపుగా ఉంటుంది. అందుకే ఆయనను మధుర కవి అని సంబోధిస్తారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలను స్థాపించారు. చైతన్య కళా ప్రవంతి, అక్షర కళాభారతి, స్పందన, స్ఫూర్తి, ప్రజాభారతి వంటి సాహితీ సంస్థలు బాగా ప్రాచుర్యం పొందాయి.

సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌కు చింతపల్లి పాఠశాల ప్రాజెక్టు ఎంపిక

రామగిరి, జనవరి 26 : తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి హైదరాబాద్ ఈ నెల 24, 25న ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలో నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని జడ్పీ హైస్కూల్ - మాల్(వీటీనగర్) విద్యార్థి టి.అజయ్ ప్రాజెక్టు సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైనట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు. 'పాస్కల్ పెయిడ్ ఇన్ బస్' ప్రాజెక్టు ఎంపిక అవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతితోపాటు ఆ పాఠశాల హెచ్ఎం ఎ.వాణి, గైడ్ టీచర్ ఎం.శ్రీవిద్య, ఉపాధ్యాయులకు అభినందలు తెలిపారు. ఈ నెల 28నుంచి ఫిబ్రవరి 1వరకు సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్ ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలని కోరారు.

గడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయురాలి ఎగ్జిబిట్ ఎంపిక

గరిడేపల్లి : దక్షిణ భారత స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు గడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయురాలు మారం పవిత్ర ఎగ్జిబిట్ ఎంపికైంది. ఈ నెల 24, 25న ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రదర్శనలో బోధనాభ్యాసన ప్రక్రియ చురుకుగా సాగేందుకు రూపొందించిన నమూనాలు టాప్‌టెన్‌లో నిలిచాయి. ఈ నమూనాల ద్వారా విద్యార్థులు క్లిష్టమైన, అమూర్త భావనలను తేలికగా అర్థం చేసుకోగలుగుతారని మారం పవిత్ర తెలిపారు. దక్షిణ భారత స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయురాలు పవిత్రను పలువురు అభినందించారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన టి.అజయ్ ప్రాజెక్టు